బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి

కామారెడ్డిలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో కామారెడ్డి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల ఆరాధ్య దైవం, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, రిజర్వేషన్ల పితామహుడి జయంతిని కామారెడ్డిలో జరుపుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, ఉపాధ్యక్షుడు రాజయ్య, హాజీ అబ్దుల్, అజీజ్, వెంకటి, విఠల్, మోహన్ ఆచారి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు, జిల్లా అధ్యక్షుడు గంగారాం, శ్రీను, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం ఆయన పోరాడినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఎస్సీ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు మర్లు సాయి బాబా, రాజేశ్వర్, గంగాప్రసాద్, పోచయ్యతోపాటు వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నాబాహూ సాఠే..

బిజ్జల్‌వాడిలో అన్నా బాహూసాఠే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాన్సువాడ, ఆగస్టు 25 : జుక్కల్ మండలంలోని బిజ్జల్‌వాడి గ్రామంలో అన్నా బాహు సాఠే జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రుషేగాం భూమయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మారుతి, హన్మంతు, పవన్, నవనాథ్, అవినాశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు విశేష స్పందన

కామారెడ్డి, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో ఐదో జిల్లాస్థాయి యోగాసన పోటీలను ఆదివారం నిర్వహించినట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 28 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

జోరుగా గంజాయి విక్రయాలు

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- మత్తుపదార్థాలకు బానిసవుతున్న యువత



బీబీపేట్, ఆగస్టు 25 : బీబీపేట మండలంలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. మండల కేంద్రంతోపాటు తుజాల్‌పూర్, శేరీ బీబీపేట, యాడారం, మాందాపూర్ తదితర గ్రామాల్లో గంజాయి సరఫరా కావడంతో యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. తుజాల్‌పూర్ గ్రామ శివారులోని నస్కల్ గ్రామానికి వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో తుజాల్‌పూర్, శేరీ బీబీపేట తదితర గ్రామాలకు చెందిన యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు తెలిసింది. మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆ మత్తులో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బీబీపేట మండల కేంద్రంతోపాటు మాందాపూర్, తుజాల్‌పూర్, మల్కాపూర్ గ్రామ శివారులో ఉన్న కోళ్ల ఫారాల వద్ద పార్టీల పేరుతో గంజాయి తాగుతున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కనీసం ఎక్సైజ్ అధికారులు మత్తు పదార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం లేదు. రెండు, మూడు నెలల క్రితం బీబీపేటకు చెందిన వ్యక్తి నిజామాబాద్‌లో గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. ఇటీవల మండలంలోని తుజాల్‌పూర్, యాడారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను గంజాయితో ఉండగా భిక్కనూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెల్సిందే. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ సిబ్బంది తమకేం పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించి జీవితాలు నాశనం కాకుండా చూడాలని ప్రజలు కోరుచున్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, ఆగస్టు 25 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం కావడంతో జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరెమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి పట్టణానికి చెందిన చాట్ల శ్రీనివాస్, మమత దంపతులు ఆలయాభివృద్ధికి రూ.10,011 అందజేశారు.

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అయ్యప్ప ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేస్తున్న అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

కామారెడ్డి, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప సేవా సమితి, అన్నప్రసాద సేవా సమితి నూతన కార్యవర్గం అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దీకొండ యాదగిరి, యాదనాగేశ్వర్‌రావు, కైలాస్ శ్రీనివాస్‌రావు, గౌరీ శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పట్నం రమేశ్, కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సొమిశెట్టి నారాయణ, అన్న ప్రసాద సేవా సమితి అధ్యక్షుడిగా విశ్వనాథుల రాజేందర్, కార్యదర్శిగా బాస రవికుమార్, కోశాధికారిగా మోత్కూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిదుర ఓంకారం, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి బొందుగలు లక్ష్మీకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా చీల శ్రీనివాస్, జొన్నల ప్రసాద్, పంపరి లక్ష్మణ్, వీరమల్లి శ్రీనివాస్, శ్రీధర్, గట్ల భాను, సహాయ కార్యదర్శులుగా రాకేశ్, నవీన్, చంద్రశేఖర్, నగేశ్, సతీశ్, శివకుమార్, ఆర్గనైజర్లుగా మోటూరి శ్రీకాంత్, కుంబాల రవియాదవ్, లీగల్ అడ్వైజర్లుగా రాజ్‌గోపాల్‌గౌడ్, దేవరాజు గౌడ్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

'అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి'

బాన్సువాడ, ఆగస్టు 25 : పట్టణంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని గతంలో మున్సిపల్ చైర్మన్ ఉన్నతాధికారులకు విన్నవించారని గుర్తు చేశారు. వెంటనే అక్రమ వెంచర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సోమిర్యాగడి తండాలో తీజ్

తీజ్ వేడుకలో పాల్గొన్న యువతులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 25: మండలంలోని సోమిర్యాగడి తండాలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివాహం కాని గిరిజన యువతులు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు సంప్రదాయ దుస్తులు ధరించి మొలకెత్తిన గోధుమ గింజల బుట్టను స్థానిక చెరువు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. సోమిర్యాగడి తండాలో నిర్వహించిన ఉత్సవాల్లో నాయకుడు కురుమ సాయిబాబాతోపాటు తండావాసులు పాల్గొన్నారు.

మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో బీఆర్ఎస్ కార్యకర్త దేవరాజు ఏర్పాటు చేసిన బైక్ మెకానిక్ షాప్‌ను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, రాజాగౌడ్, బూస శ్రీను, భూక్య నర్సింహులు, శ్రీకాంత్‌రెడ్డి, కూచని శేఖర్, రమేశ్, శ్రీశైలం, కిషన్ ఉన్నారు.

– మాచారెడ్డి, ఆగస్టు 25

డిగ్రీ కాలేజీని సందర్శించిన ఎన్‌సీసీ అధికారులు

అడ్విలింగాల డిగ్రీ కాలేజీ వద్ద ఎన్‌సీసీ అధికారులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 25: మండలంలోని అడ్విలింగాల గ్రామంలో ఉన్న డిగ్రీ కాలేజీని ఎన్‌సీసీ అధికారులు ఆదివారం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. కాలేజీలో చదువుతున్న ఆరు వందల మంది విద్యార్థులకు సెప్టెంబర్ నెలలో పది రోజులపాటు శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాలేజీలో ఎన్‌సీసీ యూనిట్ నిర్వహణ కోసం భవనాన్ని పరిశీలించారు. కంప్యూటర్ గది, ల్యాబ్, తరగతి గదులు, బాలురు, బాలికలకు వసతి గృహాలు, సెమినార్, క్రీడా ప్రాంగణం తదితర వసతులను తనిఖీ చేశారు. కాలేజీకి ఎన్‌సీసీ యూనిట్ మంజూరు అయ్యేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. దేశ రక్షణలో త్రివిధ దళాలు నిర్వహిస్తున్న పాత్రపై అవగాహన కల్పించడానికి ఎన్‌సీసీ యూనిట్ పని చేస్తుందని వెల్లడించారు. కాలేజీని సందర్శించిన వారిలో సుబేదార్ మేజర్ రచ్‌పాల్ సింగ్, సుబేదార్ ఎస్‌సీబాబు, నాయక్ సుబేదార్ హర్‌ప్రీత్ సింగ్, సత్యేంద్ర జిత్‌సింగ్, సెవెంత్ బెటాలియన్ కెప్టెన్ ఏ.బాబూరావు తదితరులు ఉన్నారు.

శ్మశాన వాటికలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఎల్లారెడ్డి, ఆగస్టు 25: శ్మశాన వాటికలో ఉరేసుకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని భిక్కనూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ గ్రామానికి చెందిన బొడ్డెపల్లి రవి(35) ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ

లింగంపేట, ఆగస్టు 25: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పరిశీలించారు. వాటిని వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగి చాలా మంది మృత్యువాత పడుతున్నారని, దివ్యాంగులుగా మారుతున్నారని తెలిపారు. వాహన ధ్రువపత్రాలు లేని, హెల్మెట్ ధరించని పలువురికి జరిమానా విధించారు.

పోచారంలో పస్కజాతర

నాగిరెడ్డిపేట, ఆగస్టు 25: మండలంలోని పోచారం గ్రామస్తులు ఆదివారం పస్క జాతరను జరుపుకొన్నారు. ఉదయం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి పంట పొలాల వద్ద వన దేవతను ఏర్పాటు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడే భోజనాలు చేసి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

లింగంపేట ఎస్సైగా అరుణ్‌కుమార్

బాధ్యతలను స్వీకరిస్తున్న ఎస్సై అరుణ్‌కుమార్

లింగంపేట, ఆగస్టు 25: లింగంపేట ఎస్సైగా అరుణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇది వరకు లింగంపేట ఎస్సైగా విధులు నిర్వహించిన చైతన్యకుమార్‌రెడ్డి మెదక్ జిల్లా చేగుంట పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అరుణ్‌కుమార్ లింగంపేటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన ఎస్సై అరుణ్‌కుమార్‌కు స్థానిక స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి

- ఉత్సవాలకు ముస్తాబైన కృష్ణుడి మందిరాలు
- యాదవులు, మథుర లాంబాడీల ప్రత్యేక ఏర్పాట్లు

గాంధారి, ఆగస్టు 25: శ్రావణ బహుళ అష్టమి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీ. ఇందుకోసం జిల్లాలోని శ్రీకృష్ణ మందిరాలు సిద్ధమయ్యాయి. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుని జననం రాత్రి కావడంతో, ఉట్టి కొట్టే సమయానికి అష్టమి తిథి ఉండాలనే సంప్రదాయంతో భక్తులు సోమవారం రోజున నిర్వహించనున్నారు. సోమవారం అర్ధరాత్రి శ్రీకృష్ణుని జననంతోపాటు ఊయల వేయడం, భజన చేయడం తదితర కార్యక్రమాలను శ్రీకృష్ణ మందిరల్లో నిర్వహించనున్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించడం కోసం జిల్లాలోని ప్రధాన శ్రీకృష్ణ ధ్యాన మందిరాలను ఇప్పటికే ముస్తాబు చేశారు.

యాదవులు, మథుర లంబాడీలకు ప్రధాన పండుగ..

శ్రీ కృష్ణుడుకి ఎంతో ఇష్టమైన గోవులను సంరక్షించడంతోపాటు వాటిని భక్తి శ్రద్ధలతో పూజించే యాదవులు, మథుర లంబాడీలు గోకులాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొంటారు. ఉమ్మడి జిల్లాలో యాదవులతోపాటు మథుర(లబాన్) లంబాడీలు గోకులాష్టమి వేడుకలను నిర్వహించుకుంటారు. గాంధారి మండలంలోని తండాల్లో గోకులాష్టమిని పురస్కరించుకొని వారం రోజుల ముందు నుంచే ఇండ్లను శుభ్రం చేసుకుంటారు. ఉపవాస దీక్షలను ఆచరిస్తూ, నియమనిష్ఠలతో ఉంటారు. శ్రీ కృష్ణున్ని భక్తితో పూజిస్తారు. గోకులాష్టమిని పురస్కరించుకొని నెయ్యితో రకరకాల పిండి వంటలను చేసుకుంటారు. పండుగ సందర్భంగా చిన్న పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబు చేస్తారు. శ్రీ కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భజనలు చేస్తారు.

ఉట్టికొట్టడం ప్రత్యేకత..

గోకులాష్టమి వచ్చిందంటే చాలు చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఉట్టి కొట్టడానికి పోటీ పడుతుంటారు. శ్రావణ బహుళ అష్టమి రోజున గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఉట్టిని కడుతారు. దానిని డీజేలు పెట్టుకొని, భజనలు చేస్తూ పగులగొడుతారు.

నేడు ఎల్లారెడ్డిలో గోకులాష్టమి వేడుకలు..

ఎల్లారెడ్డి, ఆగస్టు 25: ఎల్లారెడ్డి పట్టణంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలు ఉదయం 7 గంటలకు నిర్వహించే గోపూజతో ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. పది గంటలకు భాగ్యనగర క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉం టుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గాంధారిలోని శ్రీకృష్ణ మందిరం

ఏర్పాట్లు చేశాం..

శ్రావణ బహుళ అష్టమి పురస్కరించుకొని గోకులాష్టమి వేడుకలను నిర్వహించడం కోసం శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. శ్రీ కృష్ణుడి జననం సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాను కల్పిస్తాం.

- మచాలే లకోద్ బాబా,
శ్రీకృష్ణ ధ్యాన మందిరం ఆలయ పూజారి,
గాంధారి

ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడిగా దేవీసింగ్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 25: బీజేపీ ఎస్టీ మోర్చా నాగిరెడ్డిపేట మండలాధ్యక్షుడిగా రమావత్ దేవీసింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌నాయక్ ఆదివారం తెలిపారు. ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులుగా డి.సురేందర్, రమావత్ కబీర్‌దాస్, ఎరుకుల యాదగిరి, ప్రధాన కార్యదర్శులుగా మలావత్ భాస్కర్, లకావత్ ప్రకాశ్, కార్యదర్శులుగా మాలోత్ రవి, మాలోత్ బాల్‌సింగ్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కట్రోత్ రవి, ప్రధాన కార్యదర్శులు రంజిత్, నరేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు శ్రీనివాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి తీర్మానం

సమావేశంలో పాల్గొన్న బంజారా సంఘం నాయకులు

లింగంపేట, ఆగస్టు 25: లింగంపేటలో సేవాలాల్ ఆలయ నిర్మాణం చేపట్టాలని గిరిజన సంఘం నాయకులు తీర్మానించారు. మండల కేంద్రంలోని బంజారా సంఘ భవనం వద్ద గిరిజన సంఘం నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని సంఘ సమావేశంలో తీర్మానించినట్లు సంఘం మండల శాఖ అధ్యక్షుడు గన్నూ నాయక్ తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు దేశ్యా, కిషన్, జగ్రాం, మోతీరాం, పీర్యా, బిచ్చూ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

నోటు బుక్కులు పంపిణీ చేస్తున్న ఏజీపీ లక్ష్మణ్‌రావు

బిచ్కుంద, ఆగస్టు 25: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బిచ్కుంద (డైమండ్) ఆధ్వర్యంలో ఆదివారం నోటు బుక్కులను పంపిణీ చేశారు. బిచ్కుంద మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ) లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా హాజరై వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా నోటు బుక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. లక్ష్యం నిర్దేశించుకొని ఉన్నత స్థానాల్లో నిలువాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, గోపాల్ గంగారాం, జగదీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనంపై నిర్లక్ష్యం

శిథిలావస్థకు చేరుతున్న పంచాయతీ కార్యాలయం

శిథిలావస్థకు చేరుకున్న గాంధారి గ్రామ పంచాయతీ భవనం

గాంధారి, ఆగస్టు 25: కొన్ని సంవత్సరాలు సేవలను అందించాల్సిన గ్రామ పంచాయతీ భవనం అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్నది. గాంధారిలో 2017 సంవత్సరంలో పాత గ్రామ పంచాయతీ భవనం పక్కనే, కొత్తగా జీపీ భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి పాత గ్రామపంచాయతీ భవనాన్ని పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో జీపీ పాత భవనం పాడుపడింది. పాత జీపీ భవనం గోడలపై మర్రి, రావి చెట్లు పెరిగి, గోడలు నెర్రెలు వారుతున్నాయి. భవనం పైకప్పుపై వర్షపు నీరు నిలుస్తున్నది. గడ్డితోపాటు పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ భవనంపై పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని, మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.